
క్లుప్తంగా

ఘనంగా సాయిబాబా ఆలయ వార్షికోత్సవం



సాయిబాబాకు ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

పిఠాపురం: పిఠాపురంలో వేంచేసియున్న ఐశ్వర్య సాయినాథ్ ఆలయ వార్షికోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. గణపతి, దత్తాత్రేయ, అభయాంజనేయ, కుమార సుబ్రహ్మణ్యేశ్వరస్వామి, సాయిబాబాలకు పాలాభిషేకం, అర్చన నిర్వహించారు. ప్రత్యేక పూజల అనంతరం పేదలకు దుప్పట్లు పంపిణీ చేసిన ఆలయ కమిటీ సభ్యులు పేదలకు అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, వక్తలు పాల్గొన్నారు.

రామాలయానికి మకర తోరణం సమర్పణ

పిఠాపురం: స్థానిక చిట్టోడితోటలోని అతి పురాతన కోదండ రామాలయానికి రాష్ట్ర శ్రీరామ హిందూ ఆధ్యాత్మిక సమాజ సేవా సంఘం సభ్యులు రూ.14 వేల విలువైన మకరతోరణం బహూకరించారు. ఆదివారం ఆలయ అర్చకులకు అందజేశారు. అర్చకులు మకరతోరణాన్ని ప్రత్యేక పూజల అనంతరం స్వామి వారికి అలంకరించారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు విజయ జనార్దనాచార్యులు, సీహెచ్ శ్రీరామ్మోహన్, సుబ్రహ్మణ్యం, శ్రీనివాస్, సత్యనారాయణ, నాని తదితరులు పాల్గొన్నారు.

15 వరకూ పీబీ దేవం గేటు మూసివేత



రైల్వే గేటు మూసివేతకు సంబంధించి నోటీసు అంటించిన రైల్వే అధికారులు

సామర్లకోట: స్థానిక రైల్వే స్టేషన్ పరిధిలోని పెదబ్రహ్మదేవం గేటు నెంబరు 421 రైల్వే గేటు సోమవారం నుంచి ఈ నెల 15వ తేదీ సాయంత్రం ఏడు గంటల వరకు మూడు రోజుల పాటు మూసివేస్తున్నట్లు సీనియర్ సెక్షన్ ఇంజినీరు దాసరి సాయిశంకర్ తెలిపారు. సాయిశంకర్ స్థానిక విలేకర్లతో రైల్వే గేటు వద్ద ట్రాక్ మరమ్మతుల్లో భాగంగా కమ్మీలు మార్పు చేసి పట్టాల దిగువ భాగంలో కొత్త రాళ్లతో నింపుతున్నారు. దీనిని దృష్టిలో ఉంచుకుని గేటు మూసివేస్తున్నట్టు తెలిపారు. ఇప్పటికే పంచాయతీకి రైల్వే నుంచి నోటీసులు అందడంతో పంచాయతీ కార్యదర్శి రామ్‌నాథ్ గ్రామంలో దండోరా వేయించారు.

అధికారులూ ముద్దాయిలే

పెద్దాపురం: మండలం జి.రాగంపేట గ్రామంలో అంబటి సుబ్బన్న ఆయిల్ ఫ్యాక్టరీలో జరిగిన ప్రమాదానికి ప్రభుత్వాధికారులూ ముద్దాయిలేనని మానవ హక్కుల వేదిక బృందం పేర్కొంది. ఈ కంపెనీలో ఏడుగురు కార్మికులు మృతి చెందిన ఘటనకు బాధ్యులైన ప్రభుత్వ అధికారులపై చర్యలు తీసుకోవాలని బృందం డిమాండ్ చేసింది. ఆదివారం మానవ హక్కుల వేదిక జిల్లా అధ్యక్షుడు మొహమ్మద్ ఇక్బాల్, కార్యవర్గ సభ్యులు కె.పుష్పవల్లి, మట్టా నవీన్‌కుమార్ బృందం నిజనిర్ధారణ చేపట్టారు. సరైన అనుమతులు లేకుండా ఫ్యాక్టరీ నిర్వహించడానికి అనుమతులు మంజూరు చేసిన ఫ్యాక్టరీల ఇన్‌స్పెక్టర్, రెవెన్యూ, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు, విద్యుత్, తనిఖీల నిర్వహణలో అలసత్వం వహించిన అధికారులను ఈ కేసులో ముద్దాయిలుగా నమోదు చేయాలన్నారు. విచారణ త్వరగా పూర్తి చేసి, నివేదికలను పారదర్శకంగా అందరికీ అందుబాటులో ఉంచాలని వేదిక సభ్యులు డిమాండ్ చేశారు.

ప్రకృతివైపు సాగుదాం..

- రసాయన, పురుగు మందులకు దూరంగా..
- ఔత్సాహికులకు శిక్షణ ఇస్తున్న ఈటీసీ
- సేంద్రియ ఎరువుల తయారీపై శిక్షణ



సామర్లకోటలోని విస్తరణ శిక్షణ కేంద్రం



ఈటీసీలో ప్రకృతి వ్యవసాయంతో పండ్ల తోటల పెంపకం



సేంద్రియ ఎరువులు తయారు చేస్తున్న ఈటీసీ సిబ్బంది

సామర్లకోట: వాతావరణ మార్పుల వల్ల సంభవిస్తున్న ఉపద్రవాల నుంచి ఉపశమనం పొందడానికి వ్యవసాయ రంగంలో మార్పులు తీసుకురావలసి ఉంది. ఈ మేరకు ప్రకృతి వ్యవసాయం, సహజ వ్యవసాయ పద్ధతిని అనుసరించాలని సీఎం జగన్‌మోహన్‌రెడ్డి తీసుకున్న నిర్ణయంతో స్థానిక విస్తరణ శిక్షణ కేంద్రం(ఈటీసీ) అధికారులు ప్రకృతి వ్యవసాయంపై అడుగులు వేస్తున్నారు. ఈ శిక్షణ కేంద్రంలో శ్రీకాకుళం నుంచి పశ్చిమ గోదావరి జిల్లా వరకు ఉన్న 11 జిల్లాలోని వివిధ శాఖల అధికారులు, ప్రజా ప్రతినిధులు, మహిళా సంఘాలు, ఆపద మిత్రలకు శిక్షణ ఇస్తున్నారు. గత 10 నెలలుగా విస్తరణ శిక్షణ కేంద్రం ప్రిన్సిపాల్, జెడ్పీ డిప్యూటీ సీఈఓ జె.వేణుగోపాల్ ఆధ్వర్యంలో ఈటీసీ ఆవరణలో ప్రకృతి వ్యవసాయ పద్ధతుల ద్వారా తోటల పెంపకం చేపడుతున్నారు. భూసార పరిరక్షణ మేరకు రసాయన ఎరువులు, పురుగు మందులు లేని విధంగా దేశవాళి గోమూత్రం, వేప కాషాయం, ఆవు పేడ, ఉలవపిండి, బెల్లం వంటి పదార్థాలతో తయారు చేసిన జీవామృతం, కాడామృతం తయారు చేయడంలో శిక్షణ ఇస్తున్నారు. ఇక్కడ తయారు చేసిన జీవామృతం, కాడామృతాలతో ఈటీసీలో సేంద్రియ వ్యవసాయ పద్ధతిలో తోటలను పెంచడంపై దృష్టి సారిస్తున్నారు.

చెత్త నుంచి సంపద తయారీ కేంద్రంలో వానపాముల ద్వారా తయారు చేస్తున్న సహజ ఎరువును ఉపయోగించడం ద్వారా భూసారాన్ని పెంచుతూ చక్కని వంటింటి తోట మాదిరిగా ఆవరణను తయారు చేస్తున్నారు. ఈటీసీకి ఆదాయం వచ్చేలా మామిడి, పనస, సపోట, సీతాఫలం, జామ వంటి మొక్కలతో పాటు తిప్పతీగ, పునర్నవ వంటి ఔషధ జాతి మొక్కలను నాటుతున్నారు. శిక్షణ కేంద్రానికి వస్తున్న వారికి వీటిపై శిక్షణ ఇస్తున్నారు. ఇతర ప్రాంతాల నుంచి సందర్శకులు వచ్చేలా ఈటీసీని క్షేత్ర స్థాయి ప్రదర్శనను ఏర్పాటు చేశారు. మట్టి నమూనా పరీక్షలు చేయించి ఆయా భూములలో ఏ మేరకు భూసారాన్ని పెంచడానికి ప్రకృతి ఎరువులు వాడాల్సి ఉంటుందో సూచిస్తున్నారు.

పంటల నాణ్యత, ఆరోగ్యం



ఇటీవల కాలంలో ఎరువుల వాడకంతో పండిన పంటలను తినడం వల్ల ప్రజలు అనారోగ్యానికి గురవుతున్నారు. దీనిని దృష్టిలో ఉంచుకుని సేంద్రియ వ్యవసాయంపై అవగాహన పెంచడానికి శిక్షణ ఇవ్వడంతో పాటు ఫీల్డ్ విజిట్‌తో తోటల ద్వారా అవగాహన పెంచుతున్నాం. తక్కువ ఖర్చుతో కూడిన సేంద్రియ వ్యవసాయంతో పండిన పంటలు ఆరోగ్యాన్ని పెంపొందిస్తాయి.

– జె.వేణుగోపాల్, ఈటీసీ ప్రిన్సిపాల్, సామర్లకోట

కలిసుందాం కలకాలం

- ఆప్యాయంగా కలసిన పూర్వ విద్యార్థులు
- నాటి ముచ్చట్లకు వేదికైన లూథరన్ పాఠశాల



లూథరన్ హైస్కూలు 1981-82 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు

పెద్దాపురం: వారంతా సగం జీవితాన్ని చూసినవారు. ఓనమాలు ఒకే చోట నేర్చినవారు. విద్యావంతులై వ్యాపారులుగా, ఉద్యోగులుగా ఎక్కడెక్కడో స్థిరపడినవారు. రెక్కలొచ్చి ఎగిరిపోయిన వారంతా తిరిగి తిరిగి అలసి సొలసి పునరుత్తేజం పొందడానికన్నట్టు ఆ చదువులమ్మ చెంగు నీడన కలుసుకున్నారు. తలలు నెరిసినా తలపులు నెరవవుగా అన్న నానుడి అనుసరించి ప్రస్తుతం సుమారు 40ల్లో ఉన్న వారంతా 1980ల్లోకి తిరోగమించి నాటి పాఠశాల గదుల్లో చేసిన అల్లర్లను గుర్తు చేసుకున్నారు. సరస్వతీ పుత్రులు కొందరైతే, గడుగ్గాయిలు ఇంకొందరు, అల్లరి పిడుగులు మరికొందరు. వారంతా ఒకేచోట కలిస్తే కిష్కింధకాండ కాక మరేంటి? అదిగో అదే సాగింది స్థానిక లూథరన్ హైస్కూలులో. 1981–82 పదో తరగతి బ్యాచ్ విద్యార్థులు ఆదివారం పూర్వ విద్యార్థుల సంఘం ఆధ్వర్యంలో కలుసుకున్నారు. అధికారులుగా, జర్నలిస్టులుగా, న్యాయవాదులుగా, వివిధ హోదాల్లో పనిచేస్తున్న వారంతా నాటి జ్ఞాపకాల్లో మునిగి తేలారు.

చాలా ఆనందంగా ఉంది..



ఒత్తిళ్లమయమైన జీవితంలో చిరుప్రాయంలోని స్నేహాలు ఎన్నో సమస్యలను మరపింపజేస్తాయి. నా చిన్ననాటి స్నేహితులతో గడపడం సంతోషానిచ్చింది. స్నేహ మాధుర్యాన్ని సంపూర్ణంగా ఆస్వాదించాం. – మసకపల్లి శ్రీరంగనాయకులు, కో–ఆపరేటివ్ అసిస్టెంట్ రిజిస్ట్రార్, పెద్దాపురం

స్నేహబంధం మరచిపోలేనిది



స్నేహానికి ఉన్న బంధం ఏనాటికి మరచిపోలేనిది. చిన్ననాటి జ్ఞాపకాలు ఈ నాటికీ మదిలో ఉంటూనే ఉంటాయి. ఆ జ్ఞాపకాలతో పాటు చిన్ననాటి స్నేహితులను కలవాలనే ఉన్నేశంతో అంతదూరమైనా ఇక్కడకి వచ్చాను. చాలా సంతృప్తిగా ఉంది.

– ఏపీ లక్ష్మి, పూర్వ విద్యార్థి, చెన్నై

రత్నగిరిపై భక్తిశ్రద్ధలతో సూర్యనమస్కారాలు

అన్నవరం: రత్నగిరి కళావేదికపై ఆదివారం సూర్య నమస్కారాలు నిర్వహించారు. ఆలయ పండితులు ఉదయం తొమ్మిది గంటలకు సూర్యభగవానుడికి ప్రత్యేక పూజలు చేసి వివిధ భంగిమల్లో స్వామివారికి సూర్యనమస్కారాలు సమర్పించారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. పండితులు ఆకొండి కృష్ణశర్మ, రాందాసు, కృష్ణ పాల్గొన్నారు.



సూర్య నమస్కారాల అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు అందిస్తున్న పండితులు

సూర్యనారాయణస్వామికి ప్రత్యేక పూజలు

బోట్‌క్లబ్: మాఘమాసం మూడో ఆదివారం సందర్భంగా స్థానిక భానుగుడి భానులింగేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో ఉన్న సూర్యనారాయణస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం 5 గంటల నుంచి స్వామి వారికి ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. భక్తులు అభిషేకం నిర్వహించేందుకు బారులు తీరారు. స్వామి వారికి పంచామృతాభిషేకం నిర్వహించారు. ఆలయ కమిటీ చైర్మన్ వాకాడ సత్యనారాయణ, ఈఓ ఎం.మురళీవీరభద్రరావు ఏర్పాట్లు చేశారు.

అగ్ని ప్రమాదాలపై అప్రమత్తం

కాకినాడ జిల్లా అగ్నిమాపక అధికారి



ఆపద మిత్రలకు శిక్షణ ఇస్తున్న జిల్లా అగ్నిమాపక అధికారి ఏసుబాబు

సామర్లకోట: అగ్ని ప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలని కాకినాడ జిల్లా అగ్నిమాపక అధికారి ఏసుబాబు అన్నారు. తూర్పుగోదావరి, అనకాపల్లి జిల్లాలకు చెందిన ఆపద మిత్రల శిక్షణలో భాగంగా 7వ రోజు ఆదివారం ఆయన శిక్షణ ఇచ్చారు. స్థానిక విస్తరణ శిక్షణ కేంద్రంలో తూర్పుగోదావరి, కాకినాడ, కోనసీమ, అనకాపల్లి జిల్లాలలోని ఆపద మిత్రలకు శిక్షణ ఇస్తున్న విషయం విదితమే. ఉత్సాహవంతులైన వలంటీర్లు, ఆశా వర్కర్లను ఆపద మిత్రలుగా ఎంపిక చేశారు. ప్రస్తుతం ఏడో బ్యాచ్ శిక్షణ జరుగుతుండగా ప్రతి బ్యాచ్‌లోని ఆపద మిత్రలకు 12 రోజుల పాటు శిక్షణ ఇస్తున్న విషయం విదితమే. ప్రకృతి వైపరీత్యాల నుంచి ప్రజలను రక్షించడానికి శిక్షణ ఇస్తున్నారు. ఇంధనం నిల్వ చేసిన సమయంలో ఒత్తిడికి వేడి రూపంలో మంటలు వ్యాపిస్తాయని తెలిపారు. వివిధ రకాల అగ్నిప్రమాదాలపై శిక్షణ నిర్వహించారు. అగ్ని ప్రమాదాలు జరిగిన ప్రదేశాల్లో వేడిని తొలగించాలన్నారు. మంటలను అదుపు చేయడానికి కార్బన్‌డయాక్సైడ్ ద్వారా మంటలు అదుపు చేయవచ్చునన్నారు. అగ్ని ప్రమాదాలు జరిగిన సమయంలో నిర్ణీత ప్రమాణాలు పాటించాలన్నారు. ఈ మేరకు అగ్ని ప్రమాదాలకు సంబంధించి ప్రయోగాత్మకంగా శిక్షణ ఇచ్చారు. ఈ శిక్షణను విపత్తుల నివారణ సంస్థ ప్రాజెక్టు మేనేజర్ కిరణ్మయి, విస్తరణ శిక్షణ కేంద్రం ఫ్యాకల్టీలు వెంకటేశ్వరరావు, ఎంఎస్ఎన్ రెడ్డి పర్యవేక్షించారు.

పోస్టల్ ఉద్యోగుల సమస్యలపై దేశవ్యాప్త సమ్మె



సమావేశంలో మాట్లాడుతున్న యూనియన్ చీఫ్ అడ్వైజర్ బీవీ రావు

పిఠాపురం: గ్రామీణ తపాలా ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం మార్చి నెలలో దేశవ్యాప్త సమ్మె చేపట్టనున్నట్లు ఆలిండియా గ్రామీణ డాక్ సేవక్స్ యూనియన్ చీఫ్ అడ్వైజర్ బీవీ రావు తెలిపారు. పిఠాపురం సూర్యరాయ విద్యానంద గ్రంథాలయంలో ఆదివారం నిర్వహించిన ఆలిండియా గ్రామీణ డాక్ సేవక్స్ యూనియన్ సామర్లకోట బ్రాంచి సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా విచ్చేసి ప్రసంగించారు. గ్రామీణ తపాలా ఉద్యోగులపై అదనపు పని భారం పెంచుతున్నారని, సెలవులు ఇవ్వడం లేదని ఆయన ఆరోపించారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు వీవీ రామకృష్ణ, పి.వీర్రాజు, పి భూలోకం, పి.సోమరాజు, శ్రీనివాస్, దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

హిందీ పండిట్ అర్హతకు రాత పరీక్ష



వేట్లపాలెంలో హిందీ ప్రవీణ పరీక్ష రాస్తున్న అభ్యర్థులు

సామర్లకోట: మండల పరిధిలోని వేట్లపాలెం జెడ్పీ హైస్కూల్‌లో ఆదివారం జరిగిన హిందీ ప్రవీణ పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో హిందీ పండిట్ అర్హత కోసం ఏటా మద్రాసుకు చెందిన దక్షిణ భారత హిందీ ప్రచార సభ ఆధ్వర్యంలో ప్రాథమిక నుంచి ప్రవీణ వరకు పరీక్షలు నిర్వహిస్తున్నారు. దీనిలో భాగంగా ఆదివారం వేట్లపాలెం జెడ్పీ హైస్కూల్ హిందీ ప్రవీణ అర్హత పరీక్ష నిర్వహించారు. 10వ తరగతి విద్యార్థుల నుంచి సెకండ్ గ్రేడ్ టీచర్లు 210 మంది హాజరైనట్టు పరీక్షల చీఫ్ సూపరింటెండెంట్ పి.అనురాధ తెలిపారు. హిందీ ప్రచారక్ ఎం శేషుబాబు పర్యవేక్షణలో ఈ పరీక్షలు జరిగాయి. ప్రాథమిక నుంచి ప్రవీణ వరకు ఏటా ఫిబ్రవరి, సెప్టెంబరు నెలల్లో పరీక్షలు జరుగుతాయని ఆయన చెప్పారు.

శెట్టిబలిజల్లో సామాజిక చైతన్యం అవసరం

- త్వరలో కాకినాడ వేదికగా చైతన్యభేరి మహాసభ
- శెట్టిబలిజ జన జాగృతి సంస్థ నాయకులు వెల్లడి



సంస్థకు రూ.10 లక్షల విరాళం అందజేస్తున్న గుబ్బల తులసీకుమార్

కాకినాడ సిటీ: జిల్లాలోని శెట్టిబలిజ కులస్తులు ఐక్యతతో మిగతా బీసీ, ఎస్సీ, ఎస్టీ, ముస్లింలను కలుపుకుని జనాభా నిష్పత్తికి తగినట్లుగా రాజ్యాధికారం దిశగా కృషి చేసేందుకు శెట్టిబలిజ జన జాగృతి సంస్థ కృషి చేస్తుందని నాయకులు ప్రకటించారు. ఆదివారం కాకినాడలో కాస్మోపాలిటన్ క్లబ్‌లో రూరల్ అసెంబ్లీ నియోజకవర్గ శెట్టిబలిజ జనజాగృతి సన్నాహక సమావేశం సంస్థ నాయకులు గుత్తుల రమణ, పితాని నూకరాజు అధ్యక్షతన జరిగింది. జిల్లాలోని అన్ని గ్రామాల్లో జనజాగృతి కమిటీలను ఏర్పాటు చేస్తామని ప్రకటించారు. రాజకీయంగా శెట్టిబలిజలు ఎదుగుదలకు కృషి చేయడం, వారి సమస్యల పరిష్కారంలో అండగా ఉండడం, వారిలో సామాజిక చైతన్యం తీసుకురావడం జనజాగృతి ముఖ్య ఉద్దేశమని నాయకులు వివరించారు. త్వరలోనే కాకినాడ వేదికగా యాభై వేల మందితో జిల్లా శెట్టిబలిజ చైతన్యభేరి మహాసభ నిర్వహిస్తామని జన జాగృతి సంస్థ నాయకులు ప్రకటించారు. ఈ సభకు ముఖ్యఅతిథిగా హాజరైన ఉభయ గోదావరి జిల్లాల శెట్టిబలిజ సంఘం కోశాధికారి, యు.కొత్తపల్లి జెడ్పీటీసీ సభ్యుడు గుబ్బల తులసీకుమార్ మాట్లాడుతూ శెట్టిబలిజలు విద్యా రంగంలో ముందుకు వెళ్లాలని, విద్య ద్వారా అసమానతలు తగ్గుతాయన్నారు. శెట్టిబలిజలు రాజకీయంగా ఎదగడమే ఇందుకు సరైన పరిష్కారమన్నారు. ఈ శెట్టిబలిజ జనజాగృతి సంస్థను ముందుకు నడిపించేందుకు తక్షణ సాయంగా రూ.10 లక్షల నగదును సమావేశంలో జన జాగృతి సంస్థ నాయకులకు అందజేశారు. నాయకులు చెప్పినట్లుగా త్వరలో జరగబోయే శెట్టిబలిజ చైతన్యభేరి మహాసభ నిర్వహణకు తన వంతు సహాయంగా రూ.25 లక్షలు విరాళం ఇవ్వనున్నట్లు తులసీకుమార్ ప్రకటించారు. అనంతరం శెట్టిబలిజ చైతన్యభేరి మహాసభ పోస్టర్‌ను నాయకులు ఆవిష్కరించారు. శెట్టిబలిజ సంఘ నాయకులు రాయుడు నాగేశ్వరరావు, అనుసూరి చినబాబు, కాలా కుమార్, రాయుడు సుధాకర్, పెంకే రాధామనోహర్‌రావు, వాసంశెట్టి వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

ఇన్‌టాక్ సేవలు ఆదర్శనీయం



సమావేశంలో ప్రసంగిస్తున్న మల్లికార్జునరావు తదితరులు



చిత్రలేఖన పోటీలో పాల్గొన్న విద్యార్థులు

- ఉత్సాహంగా ఖానా–ఖజానా

కాకినాడ కల్చరల్: భారత కళలు, సంస్కృతి, వారసత్వ సంపద పరిరక్షణ సంస్థ (ఇన్‌టాక్) చేస్తున్న సేవలు ఆదర్శనీయమని సమాజ సేవకులు పీవీవీఎస్ మల్లికార్జునరావు అన్నారు. స్థానిక శాంతి నగర్‌లోని శ్రీరామకృష్ణా సేవాసమితి ఆడిటోరియంలో సంస్థ ఆధ్వర్యంలో 'ఖానా–ఖజానా' పేరుతో వ్యాసరచన, చిత్రలేఖన పోటీలు ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో సంస్థ కన్వీనర్ వీవీఎల్ఎస్ మూర్తి మాట్లాడుతూ విద్యార్థులలో మన సంస్కృతి, అలవాట్లపై అవగాహన కల్పించేందుకు సంస్థ కృషి చేస్తోందన్నారు. దీనిలో భాగంగానే వంటకాలపై చిత్రలేఖన, వ్యాసరచన పోటీలు నిర్వహించామన్నారు. పోటీలో 10 పాఠశాలల నుంచి 100 మంది విద్యార్థులు పాల్గొన్నారు. విద్యార్థులు కాజా, మిఠాయి, చేపలఫ్రై తదితర చిత్రాలను చక్కగా చిత్రీకరించారు. ఈ కార్యక్రమంలో సంస్థ కో–కన్వీనర్ వక్కలంక రామకృష్ణ, శ్రీరామకృష్ణా పబ్లిక్ స్కూల్ కరస్పాండెంట్ గాంధీ, పాఠశాల ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

అభ్యుదయ గీతాల శిక్షణ విజయవంతం



శిక్షణ తీసుకుని సర్టిఫికెట్లు అందుకున్న విద్యార్థులు

కాకినాడ సిటీ: యూటీఎఫ్ హోంలో జన విజ్ఞాన వేదిక జిల్లా కమిటీ ఆధ్వర్యంలో రెండు రోజుల దేశభక్తి, అభ్యుదయ గీతాల శిక్షణ శిబిరాన్ని విజయవంతంగా నిర్వహించారు. జన విజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షుడు కేఎంఎంఆర్ ప్రసాద్, ప్రధాన కార్యదర్శి రామారావు, సమతా కన్వీనర్ సీహెచ్ ఉమా రాజ మంగతాయారు ఆధ్వర్యంలో రెండు రోజుల శిక్షణ శిబిరాన్ని ఏర్పాటు చేసి విద్యా, వైజ్ఞానిక గీతాలపై సుమారు 50 మంది విద్యార్థులకు, ఉపాధ్యాయులకు నాట్యమండలి సురేష్ శిక్షణ ఇచ్చారు. శృతి, లయ, సంగతులు మొదలైన సంగీత అంశాల్ని ఆధారంగా పాటలను పాడే విధానాన్ని నేర్పించారు. రెండు రోజుల కార్యక్రమంలో విద్యార్థులు అనేక పాటలు నేర్చుకున్నారు. జన విజ్ఞాన వేదిక నాయకులు ఏఎస్‌రెడ్డి, ఎం సుబ్బారావు, యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి రవి చక్రవర్తి, డి.పద్మనాభం, ప్రజానాట్యమండలి శ్రీనివాస్, సీఐటీయూ నాయకులు వీరబాబు తదితరులు పాల్గొన్నారు. శాస్త్రవేత్త డార్విన్ జయంతి ఉత్సవాన్ని నిర్వహించారు.

పాదాలు తడిసినా పాపాలు పోతాయి

- పుణ్య స్నానాలకు సిద్ధమైన పాదగయ పుష్కరిణి
- ఈ నెల 18వ తేదీన మహాశివరాత్రి



పిఠాపురంలోని పాదగయ క్షేత్రంలో కుక్కుటేశ్వర స్వామి వారి నిజరూపం



పిఠాపురంలోని పాదగయ క్షేత్రంలో పుష్కరిణి

పిఠాపురం: తూర్పుగోదావరి జిల్లాలో ప్రఖ్యాత శైవ క్షేత్రాలలో పాదగయ క్షేత్రానికి ఎంతో ప్రాముఖ్యత ఉంది. త్రిగయా క్షేత్రాల్లో పిఠాపురంలో వేంచేసియున్న పాదగయ క్షేత్రం అత్యంత ప్రాచీనత కలిగిన దివ్య శైవ క్షేత్రం. ఇక్కడ ఈశ్వరుడు ప్రధాన దైవం. పురుహూతికా అమ్మవారి శక్తిపీఠం ఇక్కడే ఉంది. మహా శివరాత్రి పర్వదినాలలో ఈ క్షేత్రం భక్తులతో కిటకిటలాడుతుంది. మహాశివరాత్రి ఉత్సవాలు పురస్కరించుకుని వారం రోజుల పాటు నిత్యం ఈ క్షేత్రంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు, లక్ష పత్రి పూజలు, అమ్మవారికి కుంకుమార్చన నిర్వహిస్తుంటారు. గోదావరి పుష్కర కాలములో విశేషముగా ఒడిశా రాష్ట్రం నుంచి ఓఢ్రులు కనీసం ఇంటికి ఒకరైనా వచ్చి రాజహేంద్రవరం గోదావరిలో స్నానం చేసి పిఠాపురంలోని పాదగయ క్షేత్రంలో పిండ ప్రదానం చేయడం తరతరాలుగా వస్తున్న ఆచారం. పితృ ముక్తికరమైన క్షేత్రాలు కేవలం ఐదు మాత్రమే ఈ భూమండలంపై ఉన్నట్లు పురాణాలు చెబుతున్నాయి. వీటిలో 1.శిరోగయ, బీహార్ 2. నాభి గయ, ఒడిశా, 3.పాదగయ, పిఠాపురం, ఆంధ్రప్రదేశ్ 4. మాతృగయ సిద్ధిపూర్, గుజరాత్, 5. బదరీలోని బ్రహ్మకపాల క్షేత్రం, ఉత్తరాంచల్.

పిఠాపురం స్వయం భూశివ క్షేత్రం

శంకరుడు లోకకల్యాణార్థం గయాసురుని సంహరించు నిమిత్తం కోడి రూపమును ధరించి గయాసురుని కోరిక మేరకు లింగరూపుడై స్వయంభుగా శ్రీకుక్కుట లింగేశ్వర స్వామిగా ఈ క్షేత్రమందు విరాజిల్లుతున్నారు. భక్త కోటిని అనునిత్యము అనుగ్రహించుచున్న దివ్య స్ఫటిక లింగమూర్తి, శ్రీస్వామి వారు భక్తుల పాలిట కల్పతరువుగా ప్రసిద్ధి చెందారు.

స్వామి వారి దేవేరి రాజరాజేశ్వరీ దేవి

ఈ క్షేత్రములో శ్రీరాజరాజేశ్వరి అమ్మవారు భక్తుల పాలిట కల్పవల్లి. బ్రహ్మాండ పురాణములోని లలితా రహస్య సహస్రనామములో వర్ణించినట్లు కుమార గణనాధంబా అను నామమునకు సరిపడునట్లు ఒక పక్క చతుర్భుజమూర్తిగా మయూర వాహనుడైన కుమారస్వామి, మరోపక్క చతుర్భుజుడైన గణపతి మూర్తి అమ్మవారికి ఇరువైపులా ఉండడం విశేషం. అమ్మవారిని ఆదిశంకరాచార్య స్వామి ప్రతిష్ఠించినట్లు పెద్దలు చెబుతారు.

పాదగయ క్షేత్రంలో దర్శనీయ ఆలయాలు

పాదగయ క్షేత్రం పలు ఆలయాల సమూహం. ఇక్కడ అనేక దేవాతామూర్తుల ఆలయాలు దర్శనమిస్తాయి. తొలి పూజలు అందుకునే గణపతి, విశేష అభిషేకాలు అందుకునే కాశీ విశ్వేశ్వరుడు, కాశీ అన్నపూర్ణాదేవి, చండీశ్వరస్వామి, గయాసురిని పాదాలు, నాగేంద్రస్వామి, దత్తాత్రేయ స్వామి, సాయిబాబా, కనకదుర్గాదేవి, నవగ్రహదేవతలు, సరస్వతీదేవి, ఆదిశంకరాచార్యుడు, స్వామి అయ్యప్ప తదితర ఆలయాలు ఉన్నాయి. కుక్కుటేశ్వరుని గర్భాలయం చుట్టూ ఈ ఆలయాలన్నీ నిర్మించారు.